క్లుప్తంగా

గరుడ వాహనంపై శ్రీవారు అభయం


గరుడ వాహనం పై శ్రీవారు

సత్తెనపల్లి: పట్టణంలోని రైల్వేస్టేషన్‌రోడ్‌లోని అఖిలాండకోటి బ్రహ్మాండ నాయకుడు, కలియుగ దైవం శ్రీ అలివేలు మంగా పద్మావతి సమేత వెంకటేశ్వర స్వామి వారికీ విశేషంగా జ్యేష్ఠ మాసం, శుద్ధ పౌర్ణమిని పురస్కరించుకుని శ్రీవారి జ్యేష్ఠ స్నపన తిరుమంజనం సోమవారం శోభాయమానంగా జరిగింది. శ్రీవారి ఆలయంలోని గరుడల్వార్ మండపంలో శ్రీ అలివేలు మంగా పద్మావతి సమేత వేంకటేశ్వర స్వామి వారికీ రెండు గంటల పాటు జరిగిన స్నపన తిరుమంజనంలో కురువేరు, తెల్లపట్టు, రంగురంగుల ఎండుఫలాలు, వట్టివేరు, పసుపు రోజామాలలను శ్రీ అలివేలు మంగా పద్మావతి సమేత వేంకటేశ్వర స్వామి వారికి అలంకరించారు. ఆచార్య శ్రీమాన్ శ్రీ చిత్రకవి శ్యాము ఆచార్యులు రామానుజ దాసన్, శ్రీసూక్తం, భూసూక్తం, పురుష సూక్తం, నీలా సూక్తం, నారాయణసూక్తాలను పఠిస్తుండగా పాలు, పెరుగు, తేనె, కొబ్బరినీళ్లు, పసుపు, చందనం తదితర సుగంధ ద్రవ్యాలతో ఉత్సవమూర్తులకు విశేషంగా అభిషేకం చేపట్టారు, అనంతరం రైల్వేస్టేషన్ పుర విధులలో మంగళ వాయిద్యాలు, భజనలు, కోలాటాల నడుమ గరుడ వాహనంపై శ్రీవారు భక్తులకు అభయ ప్రదానం చేశారు. ఏకాంత సేవ కార్యక్రమాలు నిర్వ హించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని గరుడ ముద్ద, తీర్ధ ప్రసాదములు స్వీకరించారు.

టీడీపీ నుంచి వైఎస్సార్ సీపీలోకి పలువురు మైనార్టీలు చేరిక



సత్తెనపల్లి: పట్టణానికి చెందిన ఆటో ఫైనాన్స్ వ్యాపారి షేక్ బాజి, ముప్పాళ్ళ మండలం మాదల గ్రామానికి చెందిన ఖాజాబాబులు సోమవారం సత్తెనపల్లి వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కార్యాలయంలో మున్సిపల్ వైస్ చైర్మన్, పట్టణ కన్వీనర్ షేక్ నాగూర్ ఆధ్వర్యంలో వైఎస్సార్ సీపీలో చేరారు. ఈ సందర్భంగా వారిరువురికి పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. కార్యక్రమంలో కోఆప్షన్ మెంబర్ సహారా మౌలాలి, మైనార్టీ నాయకులు హుస్సేన్ మెస్త్రి, మహిబుల్లా, ఖలీల్, ఎస్‌డిఆర్ తదితరులు ఉన్నారు.

కట్టమూరులో పరశురామయ్య విగ్రహావిష్కరణ



సత్తెనపల్లి: మండల పరిధిలోని కట్టమూరు గ్రామానికి చెందిన జానపాడు పరుశురామయ్య విగ్రహాన్ని సోమవారం రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు ఆవిష్కరించారు. ముందుగా ఆయన విగ్రహానికి, ఆయన చిత్రపటానికి, దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మంత్రి అంబటి మాట్లాడుతూ పార్టీ కోసం కష్టపడేవారిలో పరశురామయ్య ఒకరని కొనియాడారు. క్రమ శిక్షణ కలిగిన నాయకుడని, ఆయన సేవలు వెలకట్టలేనవన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ వైద్యవిభాగం జిల్లా అధ్యక్షుడు డాక్టర్ గజ్జల నాగభూషణ్ రెడ్డి, పక్కాల సూరి బాబు, మండల పార్టీ అధ్యక్షుడు రాయపాటి పురుషోత్తమరావు, వ్యవసాయ సలహా మండలి రాష్ట్ర కమిటీ సభ్యుడు కళ్ళం విజయభాస్కరరెడ్డి, నాయకులు, ప్రజా ప్రతినిధులు, వైఎస్సార్ సీపీ అనుబంధ సంఘాల బాధ్యులు ఉన్నారు.

ఫ్యామిలీ డాక్టర్ ప్రోగ్రాంలో వైద్య సేవలు

సత్తెనపల్లి: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఫ్యామిలీ డాక్టర్ ప్రోగ్రాంలో భాగంగా సత్తెనపల్లి మండలం పెద్దమక్కెన గ్రామంలో ఫణిదం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిణి డాక్టర్ యు.శ్రీలక్ష్మకవిత సోమవారం వైద్య పరీక్షలు నిర్వహించారు. మొత్తం 284 మందికి పరీక్షలు చేయగా జనరల్ ఓపీ 78 మంది, హైపర్ టెన్షన్ 136 మంది, డయాబెటిస్ 49 మంది, గర్భిణీలు 11 మంది, బాలింతలు ఇరువురు, చిన్నారులు ఐదుగురు, ఎనీమియ ముగ్గురు ఉన్నారు. దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడు తూ నడవలేని వారి గృహాలకు వెళ్లి వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించి ఆరోగ్య బోధన చేశారు. కార్యక్రమంలో ఎమ్ఎల్‌హెచ్‌పీ, సీహెచ్‌ఓ బి.రత్నప్రభ, ఎంపీహెచ్‌ఎస్(ఎఫ్) జె.సంపూర్ణదేవి, ఏఎన్‌ఎమ్ సీహెచ్ భాగ్యలక్ష్మీ, హెల్త్ అసిస్టెంట్ షేక్ సుభాని, డిఇఓ కె.సుధాకర్, ఆశ కార్యకర్తలు టీ.పద్మ, కె.మరియమ్మ, కె.స్వరూపారాణి ఉన్నారు.

పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటాలి

మంత్రి అంబటి రాంబాబు



నందిగామలో మొక్కలు నాటుతున్న మంత్రి అంబటి రాంబాబు

సత్తెనపల్లి: పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్క రించుకొని సత్తెనపల్లి మండలం నందిగామలోని ఘన వ్యర్థాల నిర్వహణ కేంద్ర ప్రాంగణంలో సోమవారం ఆయన మొక్కలు నాటారు. ఈ సందర్భంగా మంత్రి అంబటి రాంబాబు మాట్లాడుతూ పర్యావరణాన్ని పరిరక్షించాల్సిన బాధ్యత మన అందరిపై ఉందన్నారు. మొక్కలు నాటడం ద్వారా కాలుష్యాన్ని నివారించవచ్చునన్నారు. ఈ సందర్భంగా మొక్కలు నాటారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నియోజక వర్గ నాయకుడు పక్కాల సూరిబాబు, సత్తెనపల్లి మండల పార్టీ అధ్యక్షుడు రాయపాటి పురుషోత్తమరావు, వ్యవసాయ సలహా సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు కళ్ళం విజయభాస్కర్ రెడ్డి, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు చిలుక జయపాల్, ఎంపీడీఓ జీవీ సత్యనారాయణ, అధికారులు, నాయకులు, తదితరులు ఉన్నారు.

ఏరియా వైద్యశాలలో....

ప్రపంచ పర్యావరణ దినోత్సవంలో భాగంగా సత్తెనపల్లి ఏరియా వైద్యశాలలో అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో సోమవారం మొక్కలు నాటారు. అభివృద్ధి కమిటీ సభ్యుడు కొత్త రామకృష్ణ మాట్లాడుతూ పర్యావరణాన్ని మనం రక్షిస్తే పర్యావరణం మనల్ని రక్షిస్తుందన్నారు. వైద్యశాల పరిసర ప్రాంతాల్లో ఎక్కువ మొక్కలు నాటడం వల్ల ఆక్సిజన్ వ్యాప్తి ఎక్కువగా ఉంటుందని, అందువల్ల ప్రతి ఒక్కరూ బాధ్యతగా ఒక మొక్క అయినా నాటి పర్యావరణాన్ని పరిరక్షించాలని కోరారు. కార్యక్రమంలో వైద్యశాల సూప రిండెంట్ డాక్టర్ లక్ష్మణరావు, వైద్యులు డాక్టర్ అప్పికట్ల ప్రవీణ్,హెడ్ నర్సులు రమణమ్మ, రాధ తదితరులు ఉన్నారు.

14వ సచివాలయంలో....

సమాజంలో ప్రతి పౌరుడు యొక్క బాధ్యత పర్యావరణ పరిరక్షణ, వాతావరణ సమతుల్యత కోసం అందరూ మొక్కలు నాటాలని ప్యానల్ దివ్వెల శ్రీనివాసరావు అన్నారు. మండల న్యాయ సేవాధికారి కమిటీ ఆధ్వర్యంలో పట్టణంలోని 11, 12 వార్డుల పరిధిలోని 14వ సచివాలయంలో ప్రపంచ పర్యావరణ దినోత్సవం సంద ర్భంగా సోమవారం మామిడి మొక్కలు నాటారు. కార్యక్రమంలో పెండ్యాల భరత్, 14 రోజు అడ్మిన్ షేక్ అల్లాభక్షు, మహిళా పోలీస్ ఎస్.భవాని కుమారి, ఏఎన్ఎం లక్ష్మి, కార్మిక శాఖ ఉద్యోగి శ్రీనివాసరెడ్డి, పారా లీగల్ వాలంటీర్ షేక్ ఖాజా ఉన్నారు.

పురపాలక సంఘం ఆధ్వర్యంలో....

ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని పురపాలక సంఘం ఆధ్వర్యంలో సోమవారం పట్టణంలో ర్యాలీ నిర్వహించి, మానవహారం చేపట్టారు. ఈ సందర్భంగా ర్యాలీ జెండా ఊపి ప్రారంభించిన కమిషనర్ కొలిమి షమ్మి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలన్నారు. మన పరిసరాల చుట్టూ పచ్చని మొక్కలు పెంచడం ద్వారా కాలుష్యం నివారించవచ్చని, స్వచ్ఛమైన ఆక్సిజన్ పొందవచ్చు


పట్టణంలో మానవహారం చేపడుతున్న మున్సిపల్, మలేరియా, సచివాలయ ఉద్యోగులు

అన్నారు. ప్రకృతిని కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందనే విషయాన్ని ప్రతి ఒక్కరూ గుర్తించాలన్నారు. ప్రకృతి మనకు అన్ని ఇస్తుందని మనం తిరిగి ఏమిస్తున్నాం అనే విషయాన్ని ప్రతి ఒక్కరూ ఆలోచన చేసుకోవాల న్నారు. ఈ సందర్భంగా 13వ వార్డు కౌన్సిలర్ బండి రాజ్యలక్ష్మి మల్లికార్జునరావు, 20వ వార్డు కౌన్సిలర్ కుకుట్ల లక్ష్మీలు మొక్కలు నాటారు. కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ సాంబశివరావు, డిఈ మధుసూదన్ రావు, శానిటరీ ఇన్స్పెక్టర్ విజయసారథి, మలేరియా సిబ్బంది, సచివాలయ పారిశుధ్య సెక్రటరీలు, పర్యావరణ కార్యదర్శులు, తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణపై అవగాహన ర్యాలీ

ముప్పాళ్ళ: ప్లాస్టిక్ వాడకం నిరోధించి పర్యావరణ పరిరక్షణపై బాధ్యతగా వ్యవహరించాలని తహసీల్దార్ ఎమ్.భవానిశంకర్ చెప్పారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవంలో భాగంగా వెన్నెల మండల సమాఖ్య ఆధ్వర్యంలో పర్యావరణ పరిరక్షణ అవగాహన ర్యాలీ సోమవారం నిర్వహించారు. ర్యాలీలో పాల్గొన్న తహసీల్దార్ భవానిశంకర్ మాట్లాడుతూ ప్లాస్టిక్ కాలుష్యం వల్ల అనేక అనర్థాలు సంభవిస్తాయన్నారు. పర్యావరణ సమతుల్యత దెబ్బతినడంతో పాటుగా ప్రకృతి వైపరీత్యాలు సంభవిస్తాయన్నారు. ప్రతి ఒక్కరూ ఇంటి ఆవరణలో, ఖాళీ స్థలాల్లో మొక్కలు నాటి పెంచాలన్నారు. ప్లాస్టిక్ కవర్లు స్వచ్ఛందంగా నిషేధించాలన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ఎంపీడీవో శ్రీనివాసరావు, ఐకేపీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందిరి బాధ్యత

పెదకూరపాడు: పర్యావరణ పరిరక్షణ అందరూ బాధ్యతగా తీసుకోవాలని ఉపాధిహామీ పథకం పీడీ జోషప్ అన్నారు. పర్యావరణ పరిరక్షణ దినోత్సవం సందర్భంగా సోమవారం పెదకూరపాడులోని రైల్వే స్టేషన్ రోడ్డులో రైల్వే డిఆర్ఈ కృష్ణయ్యతో కలిసి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా జోసఫ్ మాట్లాడుతూ ప్రతి మొక్క చెట్టుగా మారేందుకు ఎంతో కృషి చేయాలన్నారు. మొక్కలు నాటి వదిలేయడం , వాటి సంరక్షణ పట్టించుకోకపోవడం సరి కాదన్నారు. నాటి ప్రతి మొక్క చెట్టుగా మారేందుకు ప్రతి ఒక్కరు బాధ్యత తీసుకోవాలన్నారు. వాతవర్ణంలో సమతుల్యత లోపించకుండ మొక్కలు నాటాలన్నారు. ఈ కార్యక్రమం రైలు అధికారి కష్ణయ్య మాట్లాడుతూ భవిష్యత్ తరాలకు కాలుష్య రహిత సమాజం అందించేందుకు ప్రతి ఒక్కరు మొక్కలు నాటి వాటిని చెట్లుగా మార్చాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ నరసింహారావు, ఏపీవో కోటేశ్వరరావు, ఫిల్డ్ ఆసిస్టెంట్ గుంటూరు బాబు రావు లు ఉన్నారు.


ఏరియా వైద్యశాలలో మొక్కలు నాటుతున్న సూపరింటెండెంట్ డాక్టర్ లక్ష్మణరావు

చెట్లు పెంచి పర్యావరణాన్ని కాపాడుకోవాలి

రాజుపాలెం: ప్రతి ఒక్కరు చెట్లు పెంచి పర్యావరణాన్ని కాపాడుకోవాలని తహసీల్దారు నళిని, ఇందిరా క్రాంతి పథకం ఏపీఎం సునీతలు తెలిపారు. మండల కేంద్రంలో ఇందిరా క్రాంతి పథకం సిబ్బంది ఆధ్వర్యంలో పర్యావరణం దినోత్సవం సందర్భంగా సోమవారం ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో పర్యావరణాన్ని పరిరక్షణ గురించి నినాదాలు చేశారు. ప్రకృతి వనరులను కాపాడుకోవాలని సూచించారు. గ్రామ పురవీధుల్లో అవగాహన కల్పిస్తూ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో మండల సమైఖ్య అధ్యక్షురాలు సీలార్‌బీ, తహసీల్దారు నళిని, ఎంఈవో మల్లిఖార్జునశర్మ, సీసీ హరిప్రసాద్, వీఓఏలు గ్రామ సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

మొక్కలు నాటుదాం..పర్యావరణాన్ని కాపాడుదాం

అచ్చంపేట : సకల జీవరాసులకు ప్రాణవాయువు నిచ్చే మొక్కలను నాటాలని, వాటి ద్వారా పర్యావరణాన్ని కాపాడాలని పీహెచ్‌సీ వైద్యాధికారి శ్యామల అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవంలో భాగంగా స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆమె గానుక, వేప, ఉసిరి తదితర మొక్కలను నాటారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. మొక్కల వల్ల చాలా ఉపయోగాలున్నాయన్నారు. మొక్కలు వృక్షాలై వేసవిలో మంచినీడను, ఫలాలను, పూలను ఇస్తాయని, ముఖ్యంగా సకల జీవరాసుకు అవసరమైన ఆక్సిజన్‌ను ఇచ్చి, మనం వదిలే కార్బన్‌డైఆక్సైడ్ వాయువును అవి గ్రహిస్తాయని చెప్పారు. చెట్లు పర్యావరణాన్ని కాపాడుతాయని, సకాలంలో వర్షాలు పడేందుకు ఎంతో ఉపయోగపడతాయని చెప్పారు. ప్రతి ఒక్కరూ ఇంటికొక మొక్కనైనా నాటి వాటిని సంరక్షించే బాధ్యతను కూడా చేపట్టాలని డాక్టర్ శ్యామల కోరారు. కార్యక్రమంలో డాక్టర్ రాజేష్, హెల్త్ ఎడ్యుకేటర్ కె.పార్వతి, క్లష్టర్ హెల్త్ అధికారి శివనాగేశ్వరి, పీహెచ్ఎన్ మేరి జాన్స్, హెచ్‌వి ఎలిచిబెత్, బేబిరాణి, ఎపిహెచ్ఎస్ రాధాకృష్ణ, భాగవదాసు, ల్యాబ్ టెక్నీషియన్ టి.సుభాని, స్టాఫ్ నర్సులు, ఏఎన్ఎంలు, ఆశ వర్కర్స్ తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణపై అవగాహన ర్యాలీ

పెదకూరపాడు: ప్రపంచ పర్యావరణ పరిరక్షణ దినోత్సవం సందర్భంగా అమరావతిలో ఎంపీపీ మేకల హనుమంతురావు ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మేకల హనుమంతురావు మాట్లాడుతు ప్రతి ఒక్కరు మొక్కలు నాటి వాటి పరిరక్షణ బాధ్యత చేపట్టాలన్నారు. భవిష్యత్ తరాలకు కాలుష్యం లేని సమాజం అందించే బాధ్యత మనపై ఉందన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ మాధురి, హుసింగ్ ఏఈ శ్రీనివాసరావు, సెక్రటరీ కళ్యాణ్, వెంకటాద్రి ,రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ మనందరి బాధ్యత

నకరికల్లు: పర్యావరణాన్ని పరిరక్షించడం మనందరి బాధ్యత అని వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ భవనం రాఘవరెడ్డి తెలిపారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని సోమవారం అటవీశాఖ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయం ఆవరణలో మండల కన్వీనర్ భవనం రాఘవరెడ్డి మొక్కలు నాటి కార్యక్రమాన్ని ప్రారంభించారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయం, పోలీస్‌స్టేషన్, మండలంలోని అన్ని పంచాయతీ కార్యాలయాల్లో కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ నీలిమాదేవి మాట్లాడుతూ ప్లాస్టిక్ వాడకాన్ని ప్రతి ఒక్కరూ విడనాడాలన్నారు. చెట్లు నరకకుండా మొక్కలు నాటి వాటిని పోషించడం బాధ్యతగా తీసుకోవాలన్నారు. ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాలతో పాటు ఇళ్ల ముందు, రోడ్లకు ఇరువైపులా విరివిగా మొక్కలు నాటాలన్నారు. పెట్రోల్, డీజిల్ లాంటి ఇంధనాల వినియోగం తగ్గించి పర్యావరణ హితమైన ఎలక్ట్రిక్ వాహనాలను వాడాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ బండి శ్రీనివాసరెడ్డి, ఎస్ఐ పి.సురేష్, వైస్ ఎంపీపీ దూదేకుల హుస్సేన్‌బి బాషా, ఈఓపీఆర్డీ ఎంకెఎస్ గిరిధర్, ఏపీఓ రామకృష్ణ, పంచాయతీ కార్యదర్శి అరుణప్రియ, మాజీ సొసైటీ అధ్యక్షుడు దొండేటి కోటిరెడ్డి, భవనం రమణారెడ్డి, అటవీశాఖ అధికారులు ఎం.శ్యాంకుమార్, ఎస్.గోవిందరాజు తదితరులు పాల్గొన్నారు.


ర్యాలీ నిర్వహిస్తున్న ఇందిరా క్రాంతి పథకం సిబ్బంది


మొక్కలు నాటుతున్న మండల కన్వీనర్ భవనం రాఘవరెడ్డి, డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ నీలిమాదేవి


పెదకూరపాడు రైల్వే స్టేషన్ పరిధిలో మొక్కలు నాటుతున్న, పీడీ జోసప్, రైల్వే అధికారి కృష్ణయ్య


పీహెచ్‌సీ ఆవరణలో మొక్కలు నాటుతున్న వైద్యాధికారి శ్యామల



అమరావతిలో పర్యవరణ పరిరక్షణపై ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు

చుక్కల భూములకు పట్టాల పంపిణీ


రైతులకు చుక్కల భూముల పట్టాలను అంజేస్తున్న ఎమ్మెల్యే నంబూరు శంకరరావు

క్రోసూరు: 120 సంవత్సరాలుగా పరిష్కారం కానీ చుక్కల భూముల సమస్యలను సీఎం జగన్‌మోహన్ రెడ్డి పరిష్కరించి రైతులకు హృదయాల్లో నిలిచిపోయారని అన్నారు. దేశ చరిత్రలో రైతుల సమస్యలను పరిష్కరించిన ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి తగ్గుతుందని ఎమ్మెల్యే నంబూరు శంకరరావు అన్నారు. సోమవారం స్థానిక షాదీఖానాలో చుక్కల భూములను 22ఏ నుంచి పరిష్కరించి రైతులకు పట్టాల పంపిణీ చేసే కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే పాల్గొని మాట్లాడారు. 1907 బ్రిటీష్ కాలం నుంచి భూములు (అనేక సర్వే నంబర్లు) ఆర్ఎస్ఆర్‌లో చుక్క గుర్తులు పెట్టటం జరిగింది. వాటిని తొలగించడం ఎన్ని ప్రభుత్వాలు మారిన జరలేదు. చుక్కల భూములు ఉన్న రైతులు తమ పొలాలను అమ్ముకోలేరు, బ్యాంకులో కుదువ పెట్టుకోలేరు, కుమార్తెల వివావాది ఖర్చులకు, చదువులకు, ఇతర అర్థిక ప్రయోజనాలకు ఉపయోగపడలేదు. వాటిని పరిష్కరించాలని అనేక మందిరైతులు , అనేక సంవత్సరాలుగా రెవెన్యూ అధికారుల, ఉన్నతాధికారులు చుట్టూ కాళ్లు అరిగేలా తిరిగే వారు. కొన్ని చోట్ల నివాస యోగ్యంలో ఉన్న ఇళ్లబజార్లుకూడా 22ఏ జాబితాలో ఉండిపోయాయన్నారు. పాదయాత్రలో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రజల , రైతులు సమస్యలు తెలుసుకున్నందున వాటిని పరిష్కరించాలని ధృడ సంకల్పం చేశారు. అందులో భాగంగానే రాష్ట్ర వ్యాప్తంగా 2 లక్షల చుక్కల భూములకు విముక్తి కల్పించడం జరిగిందన్నారు. చుక్కల భూములు విముక్తు అవ్వటమంటే రైతులకు నిజమైన స్వేఛ్ఛ, స్వాతంత్ర్యం వచ్చినట్లేనని అన్నారు. ఈసందర్భంగా మండలంలో 410 ఎకరాల చుక్కల భూములకు సంబంధించిన 346 మందికి పట్టాలను రైతులకు ఎమ్మెల్యే నంబూరు శంకరరావు అందచేశారు. కార్యక్రమానికి వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ వెలది అప్పారావు అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో తహసీల్దార్ డి.శ్రీనివాసరావు, వీఆర్వో జిలాని , పట్టాల లబ్ధిదారులు, వైఎస్సార్‌సీపీ నాయకులు ఎంపీపీ పి.కోటయ్య, ఏఎంసీ చైర్మన్ ఈదా సాంబిరెడ్డి, వైస్ చైర్మన్ గార్లపాటిదాసు, సొసైటీ అధ్యక్షుడు అనుముల కోటిరెడ్డి, గ్రామ ఉపసర్పంచ్ షేక్ మస్తాన్, డాక్టర్ షరీఫ్, పాశంశ్రీనివాసరెడ్డి, అనుముల శ్రీనివాసరెడ్డి, తిప్పిరెడ్డి అప్పిరెడ్డి , సయ్యద్ రహీం, మర్రిశ్రీనివాసరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

విద్య ద్వారానే జీవితాల్లో సమూల మార్పులు

సత్తెనపల్లి: విద్య ద్వారానే జీవితాల్లో సమూల మార్పులు వస్తాయని సత్తెనపల్లి టౌన్ సీఐ యు.శోభన్‌బాబు అన్నారు. పట్టణంలోని వడ్డవల్లిలో సోమవారం రాత్రి మదర్ థెరిస్సా సేవా సంక్షేమ కేంద్రం, ఎమ్.ఇ.ఎఫ్ ఆధ్వర్యంలో 10వ తరగతి పరీక్షల్లో ఉత్తీర్ణులైన విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతుల అభినందన కార్యక్రమం జరిగింది. ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. సీఐ శోభన్‌బాబు మాట్లాడుతూ విద్య ఒక్కటే మన జీవితాల్లో మార్పు తెస్తోందన్నారు. మహాత్మా జ్యోతిబాపూలే, అంబేడ్కర్, బాబు జగ్జీవన్‌రామ్, అబ్దుల్ కలాం లాంటి మహనీయులను ఆదర్శంగా తీసుకుని చదవాలని కోరారు. విద్యార్థులను ప్రోత్సహించేందుకు ప్రత్యేక ప్రోత్సాహ కార్యక్రమంలు చేయడం అభినందనీయమన్నారు. వజ్రగిరి విజయ్ వర్ధన్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో పాస్టర్ సత్యానందం, చిలుక జాన్సన్, చిలుక భాస్కర్, గరికపాటి హిట్లర్, చింతపల్లి కెనడి, నల్లూరి రవి, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

వావిలాల్ నగర్‌లో చోరీ

సత్తెనపల్లి: పట్టణంలోని 31వ వార్డు వావిలాల్ నగర్ లో తాళ్ళాలు వేసి ఉన్న గృహంలో ఆదివారం రాత్రి చోరీ జరిగింది. దీనిపై పట్టణం పోలీస్ స్టేషన్‌లో సోమవారం కేసు నమోదైంది. 31వ వార్డు వావిలాల్ నగర్‌కు చెందిన బూతుకూరి గోవర్ధన వైద్యశాలలో పని చేస్తుంది. భర్త వ్యవసాయ పనులు చేస్తుంటాడు. ఆదివారం రాత్రి 8 గంటల ప్రాంతంలో ఇంటికి తాళాలు వేచి ఉండగా గుర్తు తెలియని దుండగులు ఇనుప గేటును పగలగొట్టి లోపలికి ప్రవేశించి బీరువాలో ఉన్న రూ. 50 వేలు విలువచేసే 12 గ్రాముల బంగారు ఆభరణాలు, రెండు జతల వెండి పట్టీలు అపహరించుకు పోయారు. గోవర్ధన ఫిర్యాదు మేరకు పట్టణ సీఐ యు. శోభన్ బాబు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అర్హులకు కౌలురైతు కార్డులందించాలి


సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్ భవానీశంకర్

ముప్పాళ్ళ: గ్రామాల్లో అర్హులైన కౌలు రైతులందరికీ కౌలుకార్డులు(పంటసాగుపత్రం) అందించాలని తహసీల్దార్ ఎమ్.భవానిశంకర్ చెప్పారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో వీఆర్వోలు, వ్యవసాయశాఖ సిబ్బందితో సోమవారం సమావేశం నిర్వహించారు. సమావేశంలో పాల్గొన్న తహసీల్దార్ మాట్లాడుతూ మండలంలో 1700 కార్డులు లక్ష్యం కేటాయించడం జరిగిందని, ప్రతి గ్రామంలోను ఇచ్చిన లక్ష్యాలను పూర్తి చేయాలన్నారు. గ్రామ సచివాలయాల ద్వారా అందిన అర్జీలు ఎప్పటికప్పుడు పరిష్కరించాలన్నారు. మీ సేవా ద్వారా అందిన అర్జీలు పరిష్కరించాలన్నారు. భూముల రీ సర్వే త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. రైతుల వద్ద భూయజమానుల వివరాలు సేకరించాలన్నారు. సమావేశంలో డిప్యూటీ తహసీల్దార్ సీహెచ్‌లక్ష్మీప్రసాదు, మండల వ్యవసాయాధికారి ఎమ్.అరుణ, మండల సర్వేయర్ ఏడుకొండలు, ఆర్ఐలు పవన్‌కుమార్, కపిల్‌దేవ్, ఆయా గ్రామాల వీఆర్వోలు పాల్గొన్నారు.

శిశు మరణాల నివారణకే సమగ్ర అతిసార నివారణ పక్షోత్సవం

డాక్టర్ ప్రదీప్


మాట్లాడుతున్న డాక్టర్ ప్రదీప్

సత్తెనపల్లి: చిన్న పిల్లల్లో జరిగే డయేరియా లక్షణాలను సకాలంలో గుర్తించి సరియైన చికిత్స అందించడం ద్వారా 5 సంవత్సరాల్లోపు శిశు మరణాలను నివారించుటయే ప్రధాన ఉద్దేశ్యంగా 'సమగ్ర అతిసార నివారణ పక్షోత్సవం' కార్యక్రమాన్ని ఈ నెల 5వ తేదీ నుంచి 17వ తేదీ వరకు జరుగుతుందని ఫణిదం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ వేమవరపు ప్రదీప్ అన్నారు. ఫణిదం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సోమవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. డాక్టర్ ప్రదీప్ మాట్లాడుతూ ఆశ కార్యకర్తలు తమ పరిధిలోని ఐదు సంవత్సరాల్లోపు పిల్లలు ఉన్న ప్రతి ఇంటిలోనూ ఓఆర్ఎస్ ప్యాకెట్లు పంపిణీ చేయాలన్నారు. ఫణిదం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నందు, వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్‌లో తప్పనిసరిగా ఓఆర్‌యస్ -జింక్ కార్నర్ ఏర్పాటు చేయాలన్నారు. ఓఆర్ఎస్ పాకెట్స్, జింక్ మాత్రలు అందుబాటులో ఉంచాలన్నారు. డయేరియా వ్యాధి వచ్చిన పిల్లలకు తప్పనిసరిగా 14 రోజుల పాటు జింక్ అందించాలన్నారు. డయేరియా వ్యాధి రెండు, మూడు రోజులకు తగ్గి పోయినా కూడా జింక్ మాత్రం 14 రోజుల పాటు తప్పనిసరిగా క్రమం తప్ప కుండా కొనసాగించాలన్నారు. డోస్: 2 నెలల నుంచి 6 నెలల లోపు పిల్లలకు 1/2 మాత్ర (10మి. గ్రా.).6 నెలల నుంచి 5 సం. లోపు పిల్లలకు 1 మాత్ర (20 మి. గ్రా.)వాడాలన్నారు. ఐదు సంవత్సరాలలోపు పిల్లలు ఉన్న ఇళ్లకు ఆశ కార్యకర్తలు, ఏఎన్ఎంలు వెళ్లినప్పుడు ఆ ఇంటిలోని తల్లులకు ఐడీసీఎఫ్ కార్యక్రమం పై పూర్తి అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో సి.హెచ్.ఓ. వి.సీతారావమ్మ, ఆరోగ్య విస్తరణాధికారి పి.వెంకటరావు, పి.హెచ్.ఎన్. జి.వి.సి.కె.మీనాక్షమ్మ, ఫార్మాసిస్ట్ కె.సత్య నారాయణ, సిబ్బంది, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

అతిసారా నియంత్రణ పక్షోత్సవాలు ప్రారంభం


పోస్టర్లు ఆవిష్కరిస్తున్న వైద్యాధికారి శ్యామల, సిబ్బంది

అచ్చంపేట: స్థానిక ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో అతిసారా నియంత్రణ పక్షోత్సవాలు సోమవారం ప్రారంభమైనాయి. డాక్టర్ శ్యామల, డాక్టర్ రాజేష్ అతిసారా నియంత్రణ పోస్టర్స్ విడుదల చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ శ్యామల మాట్లాడుతూ చిన్న పిల్లలలో తరచూ విరేచనాలు అయితే వాటిని ఎలా నియంత్రించాలో వివరించారు. పిల్లలను మంచి వాతావరణంలో ఉంచాలని, దోమకాటుకు గురి కాకుండా చూచుకోవాలని, కాచి చల్లార్చిన నీటిని సేవించాలని, డబ్బా పాలు ఇచ్చేవారు పాలసీసాలను బాయిల్డ్ చేసుకోవాలని సూచించారు. పాలిచ్చే తల్లులు వైద్యుల సలహాలను పాటించాలని కోరారు. 5 సంవత్సరాలు పైబడిన పిల్లలకు అయితే అధిక విరేచనాలువల్ల నీరసం రాకుండా ఓఆర్ఎస్ ప్యాకెట్స్ అందుబాటులో ఉంచుకుని గంటకొకసారి తాగించాలన్నారు. జింకు ద్రావణాన్ని తయారు చేసుకుని త్రాగించడం మంచిదన్నారు. రోడ్లవెంట అమ్మే తినుబండారాలకు దూరంగా ఉంచడం మంచిదన్నారు. విరేచనాలు అధికంగా అవుతున్నట్లయితే ఆరోగ్య కార్యకర్తలను సంప్రదించి తక్షణమే ప్రాథమిక ఆరోగ్యకేంద్రానికి తీసుకు రావాలని సూచించారు. వైద్యశాలలో 24 గంటలు తమ సిబ్బంది అందుబాటులో ఉంటారని తెలియచేశారు. కార్యక్రమంలో పీహెచ్‌సి సిబ్బంది, వైద్యశాలకు వచ్చే రోగులు, ఆశ వర్కర్లు, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

బడివయస్సు పిల్లలను ఖచ్చితంగా బడికి పంపాలి

సత్తెనపల్లి: బడివయస్సులో పిల్లలను ఖచ్చితంగా బడికి పంపాలని, ఎట్టిపరిస్థితుల్లోనూ బాల కార్మికులుగా మార్చవద్దని ప్యానల్ న్యాయవాది దివ్వెల శ్రీనివాసరావు అన్నారు. ఆంధ్రప్రదేశ్ సర్వోన్నత న్యాయస్థానం ఆదేశాల మేరకు సత్తెనపల్లి సీనియర్ సివిల్ జడ్జి, సత్తెనపల్లి మండల న్యాయసేవాధికార కమిటీ చైర్మన్ డి. నాగ వెంకటలక్ష్మి సూచనల మేరకు బాలకార్మిక వ్యవస్థను అరికట్టేందుకు నిర్వహిస్తున్న ప్రత్యేక డ్రైవ్‌లో భాగంగా పట్టణంలోని 11వ వార్డు, 12 వార్డుల పరిధిలోని 14వ సచివాలయంలో సోమవారం న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ 18 సంవత్సరాలు వయస్సు లోపు వారిని పనుల్లోకి చేర్చుకుంటే ఆయా సంస్థలపై చట్టపరమైన చర్యలు తీసుకొంటారన్నారు. కార్యక్రమంలో పెండ్యాల భరత్, కార్మిక శాఖ ఉద్యోగి శ్రీనివాసరెడ్డి, 14 వ సచివాలయం అడ్మిన్ షేక్ అల్లాబక్షు, మహిళా పోలీస్ ఎస్.భవాని కుమారి, ఏ.ఎన్.ఎమ్ లక్ష్మీ, పారా లీగల్ షేక్ ఖాజాలు పాల్గొన్నారు.

చేనేత కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

చేనేత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పిల్లలమర్రి బాలకృష్ణ

సత్తెనపల్లి: చేనేత కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరుతూ ఈనెల 19న పల్నాడు జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద జరిగే ధర్నా కార్యక్రమానికి చేనేత కార్మికులంతా తరలిరావాలని చేనేత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పిల్లలమర్రి బాలకృష్ణ పిలుపునిచ్చారు. పట్టణంలోని చేనేత సొసైటీ బిల్డింగులో సోమవారం జరిగిన చేనేత కార్మిక సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా బాలకృష్ణ మాట్లాడుతూ చేనేత కార్మికుల ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఆయన డిమాండ్ చేశారు. సదస్సులో ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘం పల్నాడు జిల్లా కార్యదర్శి అనుముల వీరబ్రహ్మం, జిల్లా కమిటీ సభ్యులు పంతంగి ప్రభాకర్, గడ్డం సుసులోవ్, బిట్ర పానకాలు, దిబ్బయ్య ,ఎం బాబురాజు, నాగలక్ష్మి, వీవర్స్ మంచి మల్లేశ్వరి, మునిని భారతి, కాకుమాను జోజి, మోపర్తి శాంతారావు, చావా చతారి పాల్గొన్నారు.